# తెలుగుప్రభ

మన భాష.. మన పత్రిక

మంగళవారం 11-7-2023

వైబ్రెంట్ ఎడిషన్ 1 pm

teluguprabha.net -TeluguPrabha @TeluguPrabhaofficial





**లేటెస్ట్ న్యూస్**

## డీటీసీపీ డైరెక్టర్‌గా దేవేందర్‌రెడ్డి

### టౌన్‌ప్లానింగ్‌లో 11 మంది బదిలీ

**తెలుగుప్రభ, హైదరాబాద్ (జూలై11)**

జీహెచ్‌ఎంసీ చీఫ్‌సిటీప్లానర్(సీసీపీ)గా పనిచేస్తున్న ఎస్.దేవేందర్‌రెడ్డి రాష్ట్ర డైరెక్టర్‌ఆఫ్ టౌన్‌అండ్‌కంట్రీప్లానింగ్(డీటీసీపీ)గా నియమితులయ్యారు. టౌన్‌ప్లానింగ్ విభాగం బదిలీల్లో భాగంగా ప్రభుత్వం 11 మంది అధికారులను బదిలీ చేసింది. వారిలో దేవేందర్‌రెడ్డిని టౌన్‌అండ్ కంట్రీప్లానింగ్ డైరెక్టర్‌గా బదిలీ చేసింది. ఆయన స్థానంలో జీహెచ్‌ఎంసీ సీసీపీగా హెచ్‌ఎంఆర్‌ఎల్‌లో ప్లానింగ్ ఆఫీసర్‌గా ఉన్న ఎం.రాజేంద్రప్రసాద్‌ను నియమించింది. మునిసిపల్ పరిపాలన శాఖలో ప్లానింగ్ డైరెక్టర్‌గా, హెచ్‌ఎండీఏ ప్లానింగ్–1 ఇన్‌ఛార్జి డైరెక్టర్‌గా ఉన్న ఎస్.బాలకృష్ణను హెచ్‌ఎంఆర్‌ఎల్ ప్లానింగ్ ఆఫీసర్‌గా బదిలీ చేసింది. డీటీసీపీగా ఉన్న కె. విద్యాధర్‌ను హెచ్‌ఎండీఏ ప్లానింగ్ డైరెక్టర్‌గా బదిలీ చేసింది.హెచ్‌ఎండీఏ ప్లానింగ్–2 డైరెక్టర్‌గా ఉన్న శివశరణప్పను మునిసిపల్ పరిపాలనశాఖ ప్లానింగ్ డైరెక్టర్‌గా బదిలీ చేసింది. బి.ప్రదీప్‌కుమార్, కె. గంగాధర్‌లకు అడిషనల్ కమిషనర్లుగా పదోన్నతులు కల్పిస్తూ అడిషనల్ సీసీపీలుగా జీహెచ్‌ఎంసీకి బదిలీ చేశారు.

### ఆన్‌లైన్ అనుమతుల్లో దేవేందర్‌రెడ్డి ముద్ర

ప్రజలకు ఇబ్బందుల్లేకుండా ఆన్‌లైన్ ద్వారానే భవన నిర్మాణాల అనుమతులు, ఆక్యుపెన్సీ సర్టిఫికెట్లు జారీ చేయాలన్న ప్రభుత్వ యోచనను అమలు చేయడంలో దేవేందర్‌రెడ్డి కీలకపాత్ర పోషించారు.టీఎస్–బీపాస్ ద్వారా వాటిని సరళీకృతం చేయడంలో తనవంతు బాధ్యత నిర్వహించారు. సోమేశ్‌కుమార్ జీహెచ్‌ఎంసీ కమిషనర్‌గా ఉన్నప్పుడు జీహెచ్‌ఎంసీకి వచ్చిన దేవేందర్‌రెడ్డి డీపీఎంఎస్ ద్వారా ఆన్‌లైన్‌లోనే నిర్మాణ అనుమతుల దరఖాస్తుల స్వీకరణను విజయవంతంగా అమలు చేశారు. జీహెచ్‌ఎంసీ చేపట్టిన ఎస్సార్‌డీపీ, ఎస్‌డీపీ, రహదారుల విస్తరణ, పార్కుల అభివృద్ధి తదితర పనులకు అవసరమైన భూసేకరణ చేశారు. భూసేకరణలో లబ్ధిదారులకు ఇవ్వాల్సిన నష్టపరిహారాన్ని నిధుల రూపేణా కాకుండా టీడీఆర్ సర్టిఫికెట్ల ద్వారా అందజేయడం ద్వారా జీహెచ్‌ఎంసీ ఖజానాపై దాదాపు రూ.4500 ఆర్థిక భారం పడకుండా చేశారు.




## రాజకీయ వారసులు

### ఎన్నికల బరిలో దిగేందుకు సై

తెరపై దాదాపు 10 మంది

చిల్డ్రన్స్ కోసం పేరెంట్స్ ఆరాటం

**ఎన్నికల సమయం దగ్గరపడుతోంది. టిక్కెట్ల కోసం ఇక్కట్లు మొదలయ్యాయి. ఏ పార్టీలో ఎవరికి టిక్కెట్లు దక్కుతాయో తెలియని అనిశ్చితి నెలకొంది. తిరిగి టిక్కెట్టు పొందేందుకు సిట్టింగ్‌లు తమ ప్రయత్నాలు ముమ్మరం చేశారు. మరోవైపు వారసులను రంగంలోకి దింపేందుకు పలువురు నేతలు ఆరాట పడుతున్నారు.**

**తెలుగుప్రభ, హైదరాబాద్(జూలై8):**

రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో పలువురు రాజకీయ నేతలు తమ వారసులను రంగంలోకి దింపేందుకు సిద్ధమవుతున్నారు. వయసురీత్యా తాము విశ్రాంతి తీసుకోవాలనుకుంటున్నవారు కొందరైతే, తమతో పాటు వారిని కూడా ఎదగనీయాలనే తలంపుతో ఇంకొందరు ఇందుకు సిద్ధమవుతున్నారు. తండ్రుల మరణానంతరం వారి వారసత్వాన్ని కొనసాగించాలనుకుంటున్న వారు కొందరున్నారు. ఒవైసీల కుటుంబంలో నాలుగోతరానికి రాజకీయ వారసునిగా అక్బరుద్దీన్ తన కుమారుడు డాక్టర్ నూరుద్దీన్ ఒవైసీని బరిలో దింపే అవకాశాలున్నాయని ఊహాగానాలు సాగుతున్నాయి. ఎంఐఎం పార్టీని అబ్దుల్ వాహెద్ ఒవైసీ స్థాపించగా, ఆయన తర్వాత ఆయన కుమారుడు సలావుద్దీన్ ఒవైసీ, అనంతరం ఆయన కుమారులు అసదుద్దీన్, అక్బరుద్దీన్‌లు రాజకీయాల్లోకి రావడం తెలిసిందే. నూరుద్దీన్ రాజకీయ అరంగేట్రం చేస్తే నాలుగోతరానికి ప్రాతినిధ్యం వహించనున్నారు.ఇక టీఆర్‌ఎస్‌లో నగరం నుంచి ముఖ్యనేతగా ఉన్న తలసాని శ్రీనివాస్‌యాదవ్ ఇప్పటికే తన కొడుకు సాయికిరణ్‌ను రాజకీయంలోకి దింపారు. గత పార్లమెంట్ ఎన్నికల్లో సికింద్రాబాద్ నియోజకవర్గంనుంచి బీజేపీ అభ్యర్థి కిషన్‌రెడ్డిపై పోటీచేసి ఓడిపోయారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో ఏదో ఒక నియోజకవర్గం నుంచి రంగంలోకి దింపుతారనే అభిప్రాయాలున్నాయి. ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ కుమారుడు జైసింహ గత అసెంబ్లీ ఎన్నికల నుంచే రాజకీయాల్లో చురుగ్గా ఉన్నారు. తండ్రి పోటీచేసినప్పుడు సైతం బూత్‌స్థాయి నుంచి పోల్ మేనేజ్‌మెంట్‌లో కీలకపాత్ర పోషించారు. మంత్రి కేటీఆర్ దృష్టిలో పడేలా కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. సికింద్రాబాద్ ఎమ్మెల్యే, డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్ కుమారుడు రామేశ్వర్‌గౌడ్ కూడా అసెంబ్లీ కోసం ఆసక్తి చూపుతున్నారు. ఈసారి తానే రంగంలో ఉంటానని పద్మారావు ఇటీవల ప్రకటించడంతో వారసుని రంగప్రవేశంపై కొంత అనిశ్చితి నెలకొంది. తీరా ఎన్నికల సమయానికి ఏ నిర్ణయం తీసుకుంటారో తెలియదు.

**తల్లితోపాటు తనకూ టిక్కెట్ ?**

మహేశ్వరం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న మంత్రి సబితా ఇంద్రారెడ్డి కుమారుడు కార్తీక్‌రెడ్డి రాజేంద్రనగర్ నియోజకవర్గం టిక్కెట్ కోసం ఉత్సాహం చూపుతున్నారు. మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు తన కుమారుడు రోహిత్‌ను అసెంబ్లీకి పంపే ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఇబ్రహీం పట్నం నుంచి మంచిరెడ్డి కిషన్‌రెడ్డి తప్పుకునే పక్షంలో ఆయన కుమారుడు మాజీ కార్పొరేటర్ ప్రశాంత్‌గౌడ్‌కు టిక్కెట్ దక్కవచ్చుననే అంచనాలున్నాయి. ఆ దిశగా ప్రయత్నాలు జరుగుతున్నట్లు తెలుస్తోంది.



లాస్య నందిత

**తండ్రుల బాటలో..**

గతంలో రాజకీయాల్లో చురుగ్గా ఉండి స్వర్గస్తులైన నేతల వారసులు సైతం రాబోయే ఎన్నికలతో అసెంబ్లీలో అడుగుపెట్టాలని ఆశపడుతున్నారు. కంటోన్మెంట్ ఎమ్మెల్యే జి.సాయన్న కుమార్తె, మాజీ కార్పొరేటర్ లాస్య నందిత తండ్రి ప్రాతినిధ్యం వహించిన కంటోన్మెంట్ నియోజకవర్గం నుంచి టిక్కెట్ కోసం ప్రయత్నిస్తున్నారు. అలాగే మాజీ మంత్రి ముఖేశ్‌గౌడ్ కుమారుడు విక్రమ్‌గౌడ్ గోషామహల్ నుంచి పోటీ చేయాలనుకుంటున్నారు. ముఖేశ్‌గౌడ్ కాంగ్రెస్‌నుంచి ప్రాతినిధ్యం వహించగా, విక్రమ్‌గౌడ్ బీజేపీ నుంచి ఆ టిక్కెట్ కోసం ప్రయత్నిస్తున్నారు. గ్రేటర్, శివార్లలో వీరితోపాటు ఇంకొందరి వారసులు కూడా ప్రయత్నాల్లో ఉన్నట్లు తెలుస్తోంది. ఇందులో ఎందరికి టిక్కెట్లు వస్తాయో.. ఎందరు గెలుస్తారో.. వేచి చూడాల్సిందే !



## తెలంగాణలోనూ అలర్ట్ భారీ వర్షాలు

**తెలుగుప్రభ, హైదరాబాద్ (జూలై11):**

భారీ వర్షాలు ఉత్తరాధిని కుదిపేస్తున్నాయి. తెలంగాణలో కూడా మరో నాలుగు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. మంగళవారం నుంచి బుధవారం ఉదయం వరకు కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్ జిల్లాల్లోని పలుచోట్ల ఉరుములు, మెరుపులతో వానలు పడుతాయని చెప్పింది. బుధవారం నుంచి గురువారం వరకు ఆసిఫాబాద్, మంచిర్యాల, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, వరంగల్, హనుమకొండ జిల్లాల్లో భారీ వర్షాలు పడే సూచనలున్నాయని పేర్కొన్నది. గురువారం నుంచి శుక్రవారం ఉదయం వరకు ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం జిల్లాల్లో, శుక్రవారం నుంచి శనివారం వరకు ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, జగిత్యాల, సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి జిల్లాల్లో భారీ వర్షాలు పడే సూచనలున్నాయి. ఈ మేరకు ఎల్లో అలెర్ట్‌ను జారీ చేసింది.






## రాజయ్య, శ్రీహరిల యుద్ధంపై.. ప్రగతిభవన్ చర్యలు

**తెలుగుప్రభ, హైదరాబాద్(జూలై11):**

స్టేషన్‌ఘనపూర్ ఎమ్మెల్యే రాజయ్య, ఎమ్మెల్సీ కడియం శ్రీహరిల మధ్య కొద్దిరోజులుగా నడుస్తున్న మాటల యుద్ధంతో ప్రగతి భవన్ చర్యలకు సిద్ధమైంది. ఎమ్మెల్యే రాజయ్యకు ప్రగతిభవన్‌కు రావాల్సిందిగా పిలుపు అందింది. కడియంపై చేస్తున్న ఆరోపణలకు సంబంధించి వివరణ కోరనున్నట్లు తెలుస్తోంది. కట్టడి చేయకపోతే వీరి మాటల యుద్ధం.. అసెంబ్లీ ఎన్నికల తరుణంలో పార్టీకి నష్టం కలిగించనున్నందున చర్యలకు సిద్ధమైనట్లు సమాచారం.

## తెలంగాణ జనాభా 4.10 కోట్లు



**తెలుగుప్రభ, హైదరాబాద్(జూలై11):** తెలంగాణ రాష్ట్రంలో ప్రస్తుత జ నాభా 4.10 కోట్లుగా ఉన్నట్లు ఆరోగ్య, కుటుంబసంక్షేమశాఖ వెల్లడించింది. నీతిఆయోగ్ అంచనా మేరకు రాష్ట్ర సంతానోత్పత్తిరేటు 1.6గా పేర్కొంది. నేడు ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా ఈ వివరాలు వెల్లడించింది. తెలంగాణలో పట్టణ జనాభా బీఆర్‌ఎస్ అధికారంలోకి వచ్చిన 2014లో 39 శాతంగా ఉండగా, ఈ సంవత్సరం చివరి వరకు 47.61 శాతానికి చేరనున్నట్లు 'నేషనల్ పాపులేషన్ రిపోర్టు–2023' అంచనా వేసింది.





## కాంగ్రెస్ దిష్టిబొమ్మలు దహనం చేయండి

### బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు

### 24 గంటల ఉచిత విద్యుత్ అవసరం లేదనడంపై మండిపాటు

**తెలుగుప్రభ, హైదరాబాద్(జూలై11):**

తెలంగాణ రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ అవసరం లేదంటూ కాంగ్రెస్ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి ప్రకటన చేసిన నేపథ్యంలో అందుకు వ్యతిరేకంగా మంగళ, బుధవారాల్లో తెలంగాణ వ్యాప్తంగా నిరసనలకు బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారకరామారావు పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ వ్యవసాయ, రైతు వ్యతిరేక విధానాలకు నిరసనగా ప్రతి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ దిష్టిబొమ్మలు దహనం చేయాలన్నారు. గతంలో కూడా విద్యుత్ ఇవ్వకుండా రైతులను గోసపెట్టిన కాంగ్రెస్ పార్టీ మరోమారు తన రైతు వ్యతిరేక విధానాల్ని బయట పెట్టుకుందని మండిపడ్డారు. ఉచిత విద్యుత్‌ను రద్దు చేయాలన్నా దుర్మార్గపు ఆలోచన ఆ పార్టీదని విమర్శించారు. తెలంగాణ రైతాంగం, ప్రజలంతా దీన్ని తీవ్రంగా వ్యతిరేకించాలని ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు.




## లాకప్‌లో కోడి ?

**తెలుగుప్రభ, మహబూబ్‌నగర్(జూలై18)**

మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల పోలీస్‌స్టేషన్‌లోని లాకప్‌లో కోడిపుంజు ఉండటం చర్చనీయాంశంగా మారింది. జడ్చర్ల సమీపంలోని బూరెడ్డిపల్లి గ్రామంలో బాలుడొకరు కోడిపుంజును దొంగిలిస్తుండగా చూసిన స్థానికులు బాలున్ని బెదిరించేంకు పోలీసులకు అప్పగించారు. మైనర్ కావడంతో బాలుణ్ని తల్లిదండ్రులకు అప్పగించిన పోలీసులకు కోడిపుంజును ఏంచేయాలో అర్థం కాలేదు.బయట ఉంచితే కుక్కల నుంచి ప్రమాదం ఉండటంతో స్టేషన్‌లోనే లాకప్‌లో ఉంచినట్లు పేర్కొన్నారు.అదన్న మాటసంగతి.

## కాల్వలోకి పెళ్లి బస్సు ఏడుగురి మృతి




తెలుగుప్రభ, ప్రకాశం (జూలై11): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ప్రకాశం జిల్లాలో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. పెళ్లి బస్సు సాగర్ కాల్వలోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో ఏడుగురు మృతి చెందారు. దీంతో పెళ్లింట విషాదచాయలు అలుముకున్నాయి. సోమవారం అర్ధరాత్రి దాటినతర్వాత దర్శి సమీపంలో ఓ పెండ్లి బస్సు సాగర్ కాల్వలోకి దూసుకెళ్లింది. దీంతో ఏడుగురు మృతిచెందారు. మరో 12 మంది గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను స్థానిక దర్శి ప్రభుత్వ దవాఖానకు తరలించారు. క్రేన్ సహాయంతో బస్సును బయటకు తీశారు. బస్సు పొదిలి నుంచి కాకినాడ వెళ్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుందని చెప్పారు. ప్రమాద సమయంలో బస్సులో 45 మంది ఉన్నట్లు సమాచారం.